కార్మికుల జీతాల్లో చేతివాటం.. 2





2 పంచాయతీ నిధులు పక్కదారి!



AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in


## అలరించిన కుస్తీ పోటీలు



**అక్షరటుడే, పెద్ద కొడప్‌గల్ :** మండలంలోని బేగంపూర్ గ్రామంలో బోనాల పండుగను పురస్కరించుకుని గ్రామస్థులు బుధవారం కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మహారాష్ట్ర, కర్ణాటక నుంచి వచ్చిన మల్లయోధులు తలపడ్డారు. మహిళలు సైతం కుస్తీ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలను తిలకించడానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.






## రైతులకు అన్యాయం చేస్తున్న కేంద్రం

**అక్షరటుడే, నిజామాబాద్‌సిటీ:** దేశరైతులకు అన్యాయం చేస్తూ కేంద్రం విదేశాలతో ఒప్పందాలు కుదుర్చుకుంటోందని డీసీసీ అధ్యక్షుడు నగేష్‌రెడ్డి విమర్శించారు. జాతీయ యువజన కాంగ్రెస్ ఆదేశాల మేరకు జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు విపుల్ గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సత్యాగ్రహ దీక్ష చేశారు. ఈ సందర్భంగా నగేష్ రెడ్డి మాట్లాడుతూ దేశ రైతులకు అన్యాయం చేసే విధంగా కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం భారతదేశంలో అమెరికా వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించే ఒప్పందం చేసుకుందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో ఉన్న రైతులను అణగదొక్కడానికి నల్లచట్టాలను తెచ్చేందుకు ప్రయత్నించిందన్నారు. దీంతో రాహుల్ గాంధీ రైతులతో కలిసి పెద్దఎత్తున ఉద్యమాలు చేయడం ద్వారా నల్ల చట్టాలు వెనక్కి తీసుకుందన్నారు. మరొకసారి రైతులకు అన్యాయం చేసే విధంగా బీజేపీ ప్రభుత్వం యూఎస్‌తో ట్రేడ్ డీల్ కుదుర్చుకుందన్నారు. దీంతో భారతదేశంలో ఉన్న రైతుల ఉత్పత్తులకు మద్దతు ధర తగ్గిపోతుందన్నారు. అమెరికా నుంచి తక్కువ ధరకు ఉత్పత్తులు వస్తే దేశ రైతుల ఉత్పత్తులను ఎవరూ కొనుగోలు చేయరని తద్వారా రైతులకు మద్దతు ధర రావడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి రామ్ భూపాల్, పీసీసీ క్రమశిక్షణ కమిటీ సభ్యులు జీవీ రామకృష్ణ, డీసీసీ ఉపాధ్యక్షుడు కౌడపు శరత్ కుమార్, గాదరి గోపి, డీసీసీ ట్రెజరీ భక్తవత్సలం తదితరులు పాల్గొన్నారు.



## కొనుగోలు కేంద్రాలు తక్షణమే ఏర్పాటు చేయాలి

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూరుతో పాటు పరిసర గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్‌కు చెందిన కల్లడి, డీకంపల్లి గ్రామాల నాయకులు సొంతి రమేష్, అభిలాష్ కోరారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ కిరణ్ కుమార్‌కు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వరి కోతలు ప్రారంభమై ఇప్పటికే 20 రోజులు గడిచినా కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో పంట నష్టం వాటిల్లుతోందన్నారు. రాత్రింబవళ్లు ధాన్యానికి కాపలా కాస్తూ కుటుంబాలతో కలిసి ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక చోట్ల ధాన్యం రోడ్లపైనే ఉండడంతో రైతులకు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రామాల వారీగా వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అభిలాష్, రమేష్, రవి, యూనిస్, రాజు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డుల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. కొత్త కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించడంతో ఇప్పటికే కార్డు ఉన్న వారి వివరాలు సైతం ఆరా తీస్తోంది. ఆదాయ పన్ను కట్టే వారు, ఖరీదైన వాహనాలు, 15 ఎకరాలకు మించి వ్యవసాయ భూమి ఉన్నవారికి కార్డులు తొలగించేందుకు సిద్ధం అయింది. అలాగే కొత్త దరఖాస్తుల్లో అనర్హులను తొలగిస్తోంది.

- అక్షరటుడే, భీమ్‌గల్



# రేషన్ కార్డుల ప్రక్షాళన

■ 16,644 దరఖాస్తుల తిరస్కరణ! ■ క్షేత్రస్థాయి పరిశీలనలో తేలిన అనర్హులు ■ విచారణ వేగవంతం చేసిన పౌరసరఫరాల శాఖ

రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన దరఖాస్తుల పరిశీలన కీలక దశకు చేరుకుంది. తాజాగా అందుతున్న వివరాల ప్రకారం, అర్హుల ఎంపికలో నిబంధనలను కఠినతరం చేయడంతో భారీ సంఖ్యలో దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయి. ఒక్క నిజామాబాద్ జిల్లాలోనే 16,644 దరఖాస్తులు అనర్హమైనవిగా అధికారులు తేల్చారు.

### క్షేత్రస్థాయి విచారణ

రేషన్ కార్డు దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి అధికారులు విచారణ జరుపుతున్నారు. సొంతంగా నాలుగు చక్రాల వాహనాలు కలిగి ఉన్నవారు, ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయపు పన్ను చెల్లింపుదారులు ఉంటే వారికి రేషన్ కార్డు ఇవ్వడం లేదు. పట్టణాల్లో సొంత ఇళ్లు, గ్రామీణ ప్రాంతాల్లో పరిమితికి మించి భూమి ఉన్నవారిని గుర్తించి జాబితా నుంచి తొలగిస్తున్నారు. అంతేగాకుండా ఇప్పటికే కార్డు ఉన్నవారికి కూడా తొలగించనున్నట్లు సమాచారం. ఈ మేరకు అధికారులు గ్రామాల్లో వివరాలు సేకరిస్తున్నారు.

### పెండింగ్‌లో దరఖాస్తులు

కామారెడ్డి, ఎల్లారెడ్డి వంటి నియోజకవర్గాల్లో ఇంకా కొన్ని వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. వీటిని కూడా సత్వరమే పరిష్కరించి, అర్హులైన వారికి త్వరలోనే కొత్త కార్డులు పంపిణీ చేసేందుకు యంత్రాంగం సిద్ధమవుతోంది. తప్పుడు సమాచారంతో కార్డులు పొందితే భవిష్యత్తులో చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు.

### అర్హులకే అందాలి

రేషన్ కార్డుల మంజూరులో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నాం. అర్హులైన పేదలకు ప్రభుత్వ ఫలాలు అందాలన్నదే మా లక్ష్యం. విచారణలో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తావు లేకుండా, నిష్పక్షపాతంగా దర్యాప్తు నిర్వహించి నివేదికలు పంపాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించాం.

– అరవింద్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ కమిషనర్

## చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలి

**అక్షరటుడే, ఇందూరు:** అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందజేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేసే పౌష్టికాహారంలో ఎటువంటి అక్రమాలు చోటు చేసుకోకుండా కేంద్ర ప్రభుత్వం నూతన యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. యాప్‌లో పూర్తి వివరాలు నమోదు చేయడం జరుగుతుందన్నారు. కేంద్రాల్లో టీచర్ల సౌకర్యార్థం ప్రభుత్వం స్మార్ట్ ఫోన్లను అందజేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ కేంద్రాల్లో అందజేసే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి పద్మ, సీడీపీవో సౌందర్య, బీజేపీ కార్పొరేటర్లు జ్యోతి మురళి, బంటు ప్రీతి ప్రవీణ్, ఇల్లెందుల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.





## మూల్యాంకన కేంద్రాన్ని సందర్శించిన అధికారులు

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** జిల్లా కేంద్రంలోని ఇంటర్ మూల్యాంకన కేంద్రాన్ని ఇంటర్ బోర్డు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ జయప్రద బాయి బుధవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మూల్యాంకన కేంద్రం పనితీరుపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంటర్ విద్య అధికారి తిరుమలపుడి రవికుమార్‌తో పాటు మూల్యాంకన కేంద్ర అధికారులు, ఇతర సిబ్బంది ఆమె వెంట ఉన్నారు.



## పూలే జయంతిని ఘనంగా నిర్వహించుకుందాం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలో మహాత్మ జ్యోతిబాపూలే జయంతిని విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ అన్నారు. ఈ మేరకు బుధవారం బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూలే జయంతి కార్యక్రమాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. 11న ఉదయం 9 గంటలకు హనుమాన్ జంక్షన్ వద్ద విగ్రహాల పార్కులో మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిద్దామన్నారు. అనంతరం 11 గంటలకు దుబ్బ మున్నూరు కాపు సంఘంలో ప్రభుత్వ అధికారికంగా సభ ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమాలకు ప్రతిఒక్క బీసీ బిడ్డ తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు బుస్సా ఆంజనేయులు, కరిపే రవీందర్, కొయ్యాడ శంకర్, చంద్రకాంత్, వాసంజయ, కోదూరు స్వామి, ఆది శ్రీనివాస్, సాయి బసవ, విజయ్, మిద్దె రవి, దారం పోతన్న, కర్క రమేష్, అపర్ణ, రేఖ, గంగాధర్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



## ధర్పల్లి ఏరియా ఆస్పత్రి పనులు త్వరితగతిన పూర్తవ్వాలి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ధర్పల్లిలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆమె ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. మండలంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 30 పడకల స్థాయి నుంచి 100 పడకలకు పెంచుతూ ఏరియా ఆస్పత్రిగా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసిందని తెలిపారు. రూ. 33.15 కోట్లతో అన్ని వసతులతో నూతన భవన నిర్మాణం చేపట్టిందన్నారు. ఇప్పటివరకు పూర్తయిన పనుల నాణ్యతను పరిశీలించి, ఇంకా చేపట్టాల్సి ఉన్న పెండింగ్ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. పనులు మందకొడిగా కొనసాగుతుండడం పట్ల కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. ఎంతమంది కార్మికులు రోజువారీగా పనుల్లో పాల్గొంటున్నారని ఆరా తీశారు. పనులను వేగంగా జరిపించాలని, వచ్చే సెప్టెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయించాలని గడువు విధించారు. వర్షాకాలం సీజన్ ప్రారంభం అయితే పనులకు ఆటంకం కలిగే అవకాశాలు ఉన్నందున యుద్ధ ప్రాతిపదికన పనులు జరిగేలా నిరంతర పర్యవేక్షణ జరపాలన్నారు. భవన నిర్మాణం పూర్తి చేయడంతో పాటు ఆస్పత్రికి అవసరమైన అన్ని వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని, పనితీరులో మార్పు కనిపించకపోతే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ప్రజారోగ్యంతో కూడుకుని ఉన్నందున ఏరియా ఆస్పత్రి నిర్మాణ పనులను వేగవంతంగా జరిపించాలని, అదే సమయంలో నాణ్యతతో పనులు జరిగేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఇసుక కొరత వంటి సాకులు చెప్పవద్దని, టీజీఎండీసీ ద్వారా అనుమతులు తీసుకుని నిర్మాణాలకు సరిపడా ఇసుక నిల్వలను సమకూర్చుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట స్థానిక తహశీల్దార్ శాంత, టీజీఎంఐడీసీ ఏఈ ప్రవీణ్ తదితరులున్నారు.

## కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో గొడవ.. 'కేక్' విషయంలో వాగ్వాదం..

**అక్షరటుడే, నిజామాబా సిటీ :** కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ జిల్లా కార్యాలయంలో నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. డీసీసీ అధ్యక్షుడు నగేశ్‌రెడ్డి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణురాజ్ మధ్య గొడవ జరిగింది. రాష్ట్ర కో-ఆపరేటివ్ యూనియన్ ఛైర్మన్, డీసీసీ మాజీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను బుధవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. వేణురాజ్ ఆధ్వర్యంలో కార్యకర్తలు కేక్ చేయడానికి యత్నించారు. అయితే వారిని జిల్లా అధ్యక్షుడు నగేశ్‌రెడ్డి, ఇతర నాయకులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. జిల్లా అధ్యక్షుడికి, వేణురాజ్‌కు మధ్య మాటల యుద్ధం నడిచింది. ఒకరిపై ఒకరు అరుచుకున్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నగేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకుల బర్త్‌డే వేడుకలు మాత్రమే జరపాలన్నారు. సీఎం, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నాయకుల పుట్టిన రోజు వేడుకలు మాత్రమే నిర్వహించాలన్నారు. తన బర్త్‌డే కూడా జరుపొద్దని సూచించారు. అలా కాకుండా పార్టీ నిబంధనలు ఉల్లంఘిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయినా కూడా ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణురాజ్ ఆధ్వర్యంలో మానాల మోహన్‌రెడ్డి బర్త్ డే వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేశారు. జిల్లా అధ్యక్షుడి మాటలను పట్టించుకోకపోవడం గమనార్హం. ఈ వ్యవహారం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.



### ముగ్గురు నాయకుల సస్పెన్షన్

క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ముగ్గురిని సస్పెండ్ చేస్తూ బుధవారం కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. డీసీసీ కార్యాలయంలో బుధవారం కిసాన్ న్యాయ్ సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షుడు నగేష్‌రెడ్డి, నగర అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు జీవీ రామకృష్ణ, పీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ తదితరులు హాజరయ్యారు. అయితే కార్యక్రమం జరుగుతున్న సమయంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి వేణురాజ్, 48వ డివిజన్ మాజీ అధ్యక్షుడు పుంద్ర సాయి కుమార్, మాజీ ఎన్ఎస్‌యూఐ నాయకుడు నరేన్ దీప్ తదితరులు మానాల మోహన్ రెడ్డి బర్త్‌డే సందర్భంగా కేక్ కట్ చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో అక్కడ బర్త్‌డే కార్యక్రమాలు నిర్వహించవద్దని తాము పేర్కొన్నామని.. అయినప్పటికీ వేణురాజ్‌తో సహా మరో ఇద్దరు వ్యక్తులు క్రమశిక్షణ నిబంధనలను ఉల్లఘించారని బొబ్బిలి రామకృష్ణ తెలిపారు. యూత్ కాంగ్రెస్ కార్యక్రమ నిర్వహణకు ఇబ్బంది కలిగిస్తూ వేడుకలు నిర్వహించినందున వేణురాజ్, వుంద్ర సాయికుమార్, నరేన్ దీప్‌లను పార్టీనుంచి సస్పెండ్ చేస్తూ చర్యలు తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఇప్పటి నుంచి ఈ ముగ్గురితో పార్టీకి ఎలాంటి సంబంధం లేదని ఓ ప్రకటనలో తెలిపారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు డిగ్రీ కళాశాల విద్యార్థులు



**అక్షరటుడే, కామారెడ్డి:** రాష్ట్ర స్థాయిలో నిర్వహించే అథ్లెటిక్స్ పోటీలకు కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. బుధవారం ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీల్లో కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అథ్లెటిక్స్ 1500 మీటర్ల పరుగు పందెం, అండర్20 విభాగంలో బీస్సీ బీజెడ్‌సీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి పి.జ్ఞానేశ్వర్, 1500 మీటర్ల పరుగు పందెం, పురుషుల విభాగం నుంచి బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న వంశీ, జావెలిన్ త్రో అండర్20 విభాగంలో బీఎస్సీ బీజెడ్‌సీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి సాయి రోహిత్ ఎంపికయ్యారు. జావెలిన్ త్రో పురుషుల విభాగంలో బీఏ ప్రథమ సంవత్సరం విద్యార్థి చంద్రశేఖర్ రెడ్డి ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఇన్‌ఛార్జి పీడీ డాక్టర్ జి.శ్రీనివాసరావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 11, 12 తేదీల్లో వరంగల్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కళాశాల తరపున ప్రాతినిథ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్ కుమార్ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదలను పెంచుతాయన్నారు. కళాశాల విద్యార్థులు చదువులోనే కాకుండా క్రీడల్లోనూ రాణించి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం గర్వకారణమని పేర్కొన్నారు. వరంగల్‌లో జరగబోయే పోటీల్లో కూడా అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చి జాతీయ స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కిష్టయ్య కళాశాల వివిధ విభాగాల అధ్యాపకులు, ఆఫీస్ సిబ్బంది విజేతలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## దేగాంలో ఉచిత వైద్య శిబిరం



**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆలూర్ మండలం దేగాం గ్రామంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ ఇట్టెడి లింగారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో ప్రజలకు బీపీ, షుగర్ పరీక్షలతో పాటు పలు రకాల వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి అయేషా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి శిబిరాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు. సర్పంచ్ లింగారెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆరోగ్యం తన మొదటి ప్రాధాన్యత అని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ధర్మపురి శ్రీనివాస్ గౌడ్, రాజేశ్వర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



# కార్మికుల జీతాల్లో చేతివాటం..

**కామారెడ్డి మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతిని ఇటీవలే ఏసీబీ బట్టబయలు చేసింది. అధికారుల చేతివాటం ప్రదర్శిస్తున్న తీరును అధికారులు తేటతెల్లం చేశారు. అయితే ఈ తతంగం వెనక ఉన్న సూత్రధారులు ఎవరన్నది ఇప్పటికీ తెలియకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఏసీబీ నివేదికపై ప్రభుత్వం నుంచి సైతం చర్యలు లేకపోవడం వెనక ఆంతర్యం ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మున్సిపాలిటీలో ఎంత అవినీతి జరుగుతున్నా చివరికి కార్మికుల జీతాలపై కూడా కన్నేయడంపై ఉన్నతాధికారుల మౌనం వహించడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.**

**– అక్షరటుడే, కామారెడ్డి**

- పని చేయకున్నా చేసినట్లుగా రిజిస్టర్లలో నమోదు
- కార్మికులకు ఇవ్వకుండా వెనకేసున్నట్లు ఆరోపణలు..
- వేతన రిజిస్టర్‌లో నమోదుపై సర్వత్రా అనుమానాలు

కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో మార్చి 16న ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతిపై పలువురి ఫిర్యాదులతో సోదాలు చేపట్టడం చర్చనీయాంశంగా మారింది. ఈ తనిఖీల్లో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చినా ఇప్పటికి వాటిపై చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ముఖ్యంగా కార్మికుల జీతాల్లో చేతివాటం ప్రదర్శించింది ఎవరన్న ప్రశ్నకు సమాధానం లభించకపోవడం గమనార్హం.

### సగం పని.. జీతం ఫుల్..

మున్సిపల్ కార్యాలయంలోని వివిధ విభాగాల్లో ఔట్ సోర్సింగ్ కార్మికులు పని చేస్తున్నారు. అయితే గత నెల 16న ఏసీబీ జరిపిన తనిఖీలలో కార్మికులు సగం నెల పనిచేసినట్టు రిజిస్టర్‌లో నమోదు చేసి.. పూర్తి జీతం చెల్లించినట్టుగా అధికారులు గుర్తించారు. ఈ అంశం మున్సిపల్ వర్గాల్లో తీవ్రచర్చకు దారి తీసింది. సగంనెల పనిచేస్తే పూర్తి నెల జీతం ఎందుకు ఇచ్చారన్న ప్రశ్నలు తలెత్తాయి. వ్యవహారం వెనక ఉన్న వ్యక్తులెవరు అనే ప్రశ్న ప్రశ్నలాగే మిగిలిపోయింది.

### కార్మికులకు చేరని జీతం..

సగం నెల పనిచేసిన కార్మికులు పని చేసిన రోజులకు మాత్రమే జీతం తీసుకున్నట్లు తెలిసింది. రికార్డుల్లో మాత్రం పూర్తినెల జీతం చెల్లించినట్లుగా నమోదు చేశారని సమాచారం. మిగతా సగం జీతం ఎవరు తీసుకున్నారు..? ఈ పని చేయడానికి కారకులు ఎవరనేది ప్రశ్నార్థకంగా మారింది. దాంతో ఈ అంశంపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలన్న డిమాండ్ పెరిగింది. అయితే ఇప్పటివరకు కార్మికుల జీతంపై విచారణ జరిపిన దాఖలాలు కనిపించడం లేదు.

### నమోదు చేసిందెవరు..?

కార్మికులకు సంబంధించిన మొత్తం వ్యవహారంలో కీలకంగా పని చేసిన ఆ వ్యక్తి ఎవరనేది ప్రశ్నార్థకంగా మారింది. పూర్తి జీతం తీసుకున్నట్లుగా అధికారులే నమోదు చేసారా.. ? లేక ఇతర నాయకులు ఎవరైనా ఒత్తిడి చేసారా..? అనేది తెలియాల్సి ఉంది. అయితే ఇలా ఎన్నేళ్ల నుంచి సగం పనికి పూర్తిజీతం ఇస్తున్నట్టుగా నమోదు చేశారు..? ఎంతమంది కార్మికుల జీతాలు ఇలా వెనకేశారు అనే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది.

### నాయకులకా..? అధికారులకా..?

ఔట్ సోర్సింగ్ కార్మికుల జీతాల విషయంలో అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఏ కార్మికుడైనా నెలలో కొన్ని రోజులు ఇంటి అత్యవసర పనుల నిమిత్తమో, అనారోగ్య కారణాలతోనో సెలవు పెట్టడం సహజంగా జరిగేదే. అయితే ఇలా ఎంతమంది కార్మికుల నుంచి పని చేయకున్నా చేసినట్లుగా మొత్తం జీతం ఇచ్చినట్లుగా రికార్డుల్లో నమోదు చేశారనేది తెలియాల్సి ఉంది. అయితే కార్మికుల జీతాల మాయం వెనక నాయకుల హస్తం ఏదైనా ఉందా..? వారి జేబుల్లోకే కార్మికుల జీతాలు వెళ్లాయా..? నాయకుల పేర్లు చెప్పి అధికారులు ఇదంతా చేసారా..? వాళ్లే కార్మికుల జీతాలు మింగేసారా..? అనే ప్రశ్నలకు సమాధానం రావాల్సి ఉంది.

ఒక నెలనో.. రెండు నెలలో ఇలా జరిగితే ఏదైనా పొరపాటు అనుకోవచ్చు. ఏళ్ల తరబడి జరిగితే మాత్రం రూ. లక్షల్లో జీతాలు చేతులు మారాయని చెప్పుకోవచ్చు. విచారణ చేస్తే సదరు వ్యక్తుల డొంక కదులుతుందని పలువురు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## శ్రీకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులు పరీక్ష సామగ్రి అందజేత



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని ఖిల్లా గురుకుల బాలుర పాఠశాలలో బుధవారం శ్రీకృష్ణ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. సుమారు 70మంది చిన్నారులకు పరీక్షప్యాడ్లు, పెన్నులు, బిస్కెట్ ప్యాకెట్లు, చాక్లెట్లు అందించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులైన బాలకృష్ణ, రాజేశ్వర్ గుప్తా, ప్రసాద్, నరోత్తం రెడ్డి తదితరులకు పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం రాజమణి కృతజ్ఞతలు తెలిపారు.

## నాలుగు లేబర్ కోడ్‌లను ఎత్తివేయాలి



**అక్షరటుడే, ఆర్మూర్:** కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌ల అమలును నిలిపివేయాలని కార్మిక సంఘాల జేఏసీ పిలుపునిచ్చింది. పట్టణంలో తహశీల్దార్ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు మాట్లాడుతూ.. నరేంద్ర మోడీ ఎన్నికల్లో కార్మికుల ఉపాధి కాపాడుతానని హామీ ఇచ్చి, ఐదేళ్లుగా కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను అమలు చేసేందుకు యత్నిస్తున్నారన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను హరించడమే కాకుండా, ఎనిమిది గంటల పని విధానం రద్దుచేసి 12 గంటలు పని తీసుకోవడం దుర్మార్గమని ఆవేదన చెందారు. కార్యక్రమంలో ఐఎఫ్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శివాజీ, సీఐటీయూ ఆర్మూర్ మండల అధ్యక్షుడు కుతాడి ఎల్లయ్య, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, నాయకులు సొప్పరి గంగాధర్, చిట్యాల నర్సయ్య పాల్గొన్నారు.

## ఆర్టీసీ డిపో ఎదుట కార్మికుల రిలే నిరాహార దీక్ష



**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. డిపో మేనేజర్ మొండి వైఖరికి నిరసనగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు రవీందర్ మాట్లాడుతూ.. బాన్సువాడ డిపోలో 25 రోజులుగా డ్రైవర్లు సాజిద్, రియాజ్‌లను విధులకు పంపకుండా వేధిస్తున్నారన్నారు. తమను బలవంతంగా డ్రైవర్‌తో పాటు కండక్టర్ విధులు కూడా నిర్వహించాలని డిపో మేనేజర్ తీవ్ర ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. తమకు ఆంగ్ల భాష తెలియదని, కండక్టర్ పనులు చేయడం సాధ్యం కాదని పలుమార్లు చెప్పినా వినిపించుకోకుండా డ్రైవర్ విధులకు సైతం తమను అనుమతించట్లేదన్నారు. దీంతో పాటు ఈనెల జీతంలో కోత విధించడాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించారు. దీనిపై నిరసనగా డిపో ఎదుట ధర్నా నిర్వహించగా, సంబంధిత డ్రైవర్లకు ఛార్జ్ షీట్లు జారీ చేయడం జరిగిందన్నారు. ఈ పరిస్థితుల్లో మరే మార్గం లేక నేటి నుంచి రిలే నిరాహార దీక్షలను ప్రారంభించామని తెలిపారు. వీరికి మద్దతుగా డిపో కార్మికులు, ఇతర యూనియన్ నాయకులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డి.శంకర్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో రక్తదాన శిబిరం




**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడలోని ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం రక్తదాన శిబిరం విజయవంతంగా నిర్వహించారు. శిబిరాన్ని జంతుశాస్త్ర విభాగం, ఐక్యూఏసీ, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో మేరా యువ భారత్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, బాన్సువాడ భాగస్వామ్యంతో ఏర్పాటు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందూర్ గంగాధర్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడటం గొప్ప సేవ అని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రిలో రక్త యూనిట్ల కొరత ఉందని బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు తెలియజేయడంతో, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు వెంటనే స్పందించి రక్తదానం చేయడానికి ముందుకు వచ్చారని చెప్పారు. శిబిరంలో సుమారు 35 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు తెలిపారు. రక్తదానం చేసిన అధ్యాపకులు, విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు గులాం ముస్తఫా, రఫియా, వినయ్ కుమార్, కృష్ణ, బాలరాజ్, పద్మ, రాజేష్, శ్రావణి, ప్రభుత్వ ఆస్పత్రి ల్యాబ్ టెక్నీషియన్ రఘు, మేరా యువ భారత్ ప్రతినిధి సునీల్ రాథోడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

# పంచాయతీ నిధులు పక్కదారి..!

- వేల్పూర్ మండలంలో డిజిటల్ మాయాజాలం
- ప్రజాప్రతినిధులకు తెలియకుండానే రూ.లక్షల్లో డ్రా
- కంప్యూటర్ ఆపరేటర్లే కీలకం.. ఆపై అధికారుల అండదండలు..?
- మోతె గ్రామంలో వెలుగుచూసిన కార్యదర్శి ‘లీలలు’
- ఫోర్జరీ సంతకాలతో నిధులు స్వాహా..

**గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం ప్రభుత్వం కేటాయించే 15వ ఆర్థిక సంఘం నిధులు దారి మళ్లుతున్నాయి. ప్రజాప్రతినిధుల ప్రమేయం లేకుండానే, నిబంధనలను తుంగలో తొక్కి రూ. లక్షల్లో ప్రజాధనాన్ని డ్రా చేస్తున్నారు. వేల్పూర్ మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో ఈ తరహా అక్రమాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. తాజాగా మోతె గ్రామ పంచాయతీలో జరిగిన ఉదంతం మండలంలో చర్చనీయాంశంగా మారింది.**

**– అక్షరటుడే(వేల్పూర్), భీమ్‌గల్**




గ్రామ పంచాయతీ నిధుల విత్‌డ్రా ప్రక్రియలో సర్పంచ్, కార్యదర్శితో పాటు ఉపసర్పంచ్ సంతకం కూడా తప్పనిసరి. సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో ఈ ప్రక్రియను ‘డిజిటలైజేషన్’ చేశారు. కానీ, ఇదే ఇప్పుడు అవినీతి అధికారులకు వరంగా మారింది. మండల పరిషత్ కార్యాలయంలోని కొంతమంది కంప్యూటర్ ఆపరేటర్ల వద్ద మండలంలోని అన్ని పంచాయతీల ఉపసర్పంచుల ఈమెయిల్ ఐడీలు, పాస్‌వర్డ్‌లు నిక్షిప్తమై ఉన్నాయి. కార్యదర్శులు చెక్కులు తీసుకురాగానే, ఉపసర్పంచుల ప్రమేయం లేకుండానే వారి మెయిల్స్‌కు వచ్చే ఓటీపీలను వాడుకుంటూ నిధులను ఆమోదింపజేస్తున్నారు. ఫలితంగా తమ సంతకం లేకుండానే రూ. లక్షలు ఎలా డ్రా అవుతున్నాయో తెలియక ఉపసర్పంచులు విస్తుపోతున్నారు.

### మోతె గ్రామంలో బట్టబయలు..

మోతె గ్రామ పంచాయతీలో దాదాపు రూ.1.76 లక్షల మేర నిధులను ఉపసర్పంచ్ అనుమతి లేకుండానే డ్రా చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. కేవలం సైడ్ డ్రెయిన్లు, కల్వర్టుల మరమ్మతులు, ట్రాక్టర్ డీజిల్ బిల్లుల పేరిట గత నెలలో నోట్ ఫైల్స్ సిద్ధం చేసి, పాత తేదీలతో చెక్కులను డ్రా చేసినట్లు రికార్డులు చెబుతున్నాయి. ఈ విషయంలో ఉపసర్పంచ్ కరోల్ల పరంజ్యోతి కుమార్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయటపడింది.

### అక్రమాల చిట్టా ఇదేనా..?

కార్యదర్శి తన సొంత వాహనానికి సంబంధించిన పెట్రోల్, డీజిల్ ఖర్చులను కూడా పంచాయతీ ఖాతా నుండే చెల్లిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. కార్యదర్శులు నిర్దేశించిన సమయానికి కార్యాలయానికి రాకపోవడం, ప్రజలకు అందుబాటులో ఉండకపోవడం పరిపాటిగా మారింది. మోతె కార్యదర్శి పలు రోజులు విధులకు గైర్హాజరైనప్పటికీ హాజరు పట్టీలో మాత్రం సంతకాలు ఉన్నట్లు సమాచారం.

### అధికారుల అండదండలతోనేనా..!

ఈ వ్యవహారంలో మండల స్థాయి అధికారుల పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కంప్యూటర్ ఆపరేటర్లు నేరుగా కార్యదర్శులకు సహకరించడం వెనుక పెద్దఎత్తున ముడుపులు అందుతున్నట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో పనులు జరగకుండానే ఎంబీలు రికార్డు చేసి నిధులు మళ్లించడం వెనుక ఒక నెట్‌వర్క్ పనిచేస్తున్నట్లు గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## ద్విచక్ర వాహనాలకు నిప్పు.. కాలిబూడిదైన బైకులు



**అక్షరటుడే, ఆర్మూర్ :** జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండ గ్రామంలో మంగళవారం రాత్రి ఇంటి బయట నిలిపి ఉంచిన రెండు ద్విచక్ర వాహనాలను దుండగులు దహనం చేశారు. తొర్లికొండ గ్రామానికి చెందిన సింగారం వెంకటరమణ, సింగారం శ్రీకాంత్ ఇద్దరు అన్నదమ్ములకు చెందిన రెండు ద్విచక్ర వాహనాలను రోజూ మాదిరిగానే వారి ఇంటి ఎదుట నిలిపి పడుకున్నారు. కాగా.. రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు వారి వాహనాలను దహనం చేశారు. కాగా.. ఈ విషయమై జక్రాన్‌పల్లి పోలీసుల కు బాధితులు ఫిర్యాదు చేశారు. సంఘటన జరిగిన ఇంటిముందు, చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాల్లో నిందితుల ఆధారాలను సేకరిస్తున్నారు.

## డ్రంకన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలుశిక్ష

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** డ్రంకన్ డ్రైవ్‌లో పలువురికి జైలు శిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఈ మేరకు ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్‌అలీ వివరాలు వెల్లడించారు. నగరంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో తనిఖీలు చేస్తుండగా తొమ్మిది మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లుగా గుర్తించి వారిని కోర్టులో హాజరుపర్చారు. విచారించిన న్యాయమూర్తి ఏడుగురికి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధించి.. ఇద్దరికి సాధారణ జైలుశిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చిందని ఏసీపీ తెలిపారు.